

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

# వి‌ఆర్ మున్సిపల్ హైస్కూల్ గా పేరు మార్పుపై ఆనం అభ్యంతరం

- కార్పోరేట్ కబంధ హస్తాల్లో విద్యావ్యస్థ నలిగి పోతుంది
- మంత్రి నారాయణ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవాలి
- విఆర్ పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి ఆనం ఘాటు వాఖ్యలు



**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త** మున్సిపల్ శాఖమంత్రి నారాయణ చోరవ చూపినంత మాత్రాన విఆం హైస్కూల్ పేరును విఆర్ మున్సిపల్ హైస్కూల్‌గా మార్చటం ఏంటి,కార్పోరేషన్ నిధుల నుండి ఒక్కరూపాయి కూడా ఈ ఖర్చుపెట్టలేదు అయినా కార్పోరేషన్ స్కూల్ ఎట్లా అయిపోయిందో నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నాకు వివరణ ఇస్తే తెలుసుకుంటాను అంటూ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విఆర్ హైస్కూల్ పేరు మార్పుపై ఘాటు వాఖ్యలు చేశారు. సోమవారం విఆర్ పాఠశాల ప్రారంభోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేష్,జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి ఫరూక్‌ల సమక్షంలో బహిరంగ వేదికపై మంత్రి ఆనం ఈ వాఖ్యలను చేయటం అందరిని ఒకింత విస్మయానికి గురిచేసింది. మంత్రి ఆనం మాట్లాడుతు తమ పూర్వీకుల కాలం నుండి వెంకటగిరి రాజాస్ పేరుమీదనే ఈ పాఠశాలను నడిపిస్తూ వస్తునామని, గత 45 సంవత్సరాలుగా తాము ఈ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలో ఉండి వేలమంది పేదలకు విద్యాబుద్దులు నేర్పించటం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ కమిటీలను రద్దుచేశారని గుర్తుచేశారు. కార్పోరేట్ విద్యాసంస్థల కబంద హస్తాల్లో విద్యావ్యవస్థ నలిగిపోతుందని, పేదలకు చదువు చెప్పేందుకు అపట్లో ఈ పాఠశాలను ప్రారంబించటం జరిగిందన్నారు. ప్రస్తుతం విఆర్ ఆధునీకరణకోసం ప్రయివేట్ కంపెనీలు, బ్యాంకులు వారి వంతుగా సిఎస్ఆర్‌ఫండ్స్ ఇస్తే ఆదునీకరణ జరిగిందన్నారు. విఆర్‌స్కూల్ అభివృద్ధికి మంత్రి నారాయన సహకరిస్తే అధి మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్‌గా ఎలా మారుస్తారని మంత్రి ప్రశ్నించారు.అ లాగే కార్పోరేట్ శక్తుల చేతుల్లోకి ఈ పాఠశాల వెల్లకుండా చూడాలన్నారు. తాము పుట్టుకతోనే రాజకీయ కుటుంబం నుండి వచ్చామని, నారాయణ కార్పోరేట్ విద్యాసంస్థల ద్వారాఎదిగిన తరువాత రాజకీయాల్లోకి రావటం జరిగిందన్నారు. కార్పోరేట్ విద్యాసంస్థల్లో అగ్రగామిగా ఉన్న నారాయణ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ది చేయ్యాలని సూచించారు. ఎంపీ వేమిరెడ్డి తన సొంత నిధులతో ఆర్‌ఎస్ఆర్ పాఠశాలను, డిఎస్ఆర్ సంస్థలు సంస్కృత పాఠశాలను దత్తత తీసుకోవటం ఆహ్వానించ దగిన అంశమన్నారు. ఎన్నికల సమయంలో మంత్రి నారాయన నగరంలోని 90వేల నివాసాల్లో 80వేల నివాసాలను తిరిగానని చెప్పారని, అయితే అదేస్థాయిలో రూరల్‌లోకూడా ఇల్లు, ప్రజలు ఉన్నారన్నారు. కాగా మంత్రి ఆనం భహిరంగ వేదికపై ఇలా మాట్లాడటంపై జిల్లా వాసులు బిన్న వాదనలువినిపిస్తున్నారు.

## ప్రత్యేక శ్రద్ధతో అర్జీల పరిష్కారం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 327 అర్జీలు - జాయింట్ కలెక్టర్ కే కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త** సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో, ప్రజా సమస్యల పరిష్కార వేదిక జాయింట్ కలెక్టర్ కే. కార్తీక్ ఇన్చార్జి డిఆర్‌వో హుస్సేన్, డిపిఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మోహన రావు, డిఆర్డిఏ పిడి రాజకుమారి ఆధ్వర్యంలో ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 327 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 120, మున్సిపల్‌శాఖకు సంబంధించి 17, పంచాయతీ రాజ్‌శాఖకు 19, పోలీసు శాఖకు 43, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 19 అర్జీలు అందాయి. మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## భావి తరాల భవిశ్యత్తుకు మంత్రి లోకేష్ పునాదులు వేస్తున్నారు



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :** గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ఇళ్ల స్థలాలు పంపిణీలో జాప్యం జరుగుతుంది సూపర్ సిక్స్ లో 80 శాతం పధకాలు అమలు చేసాం. ఇఫ్కో, షుగర్ ఫ్యాక్టరీలలో పరిశ్రమల స్థాపన కోసం ఎంపి వేమిరెడ్డి కృషి చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందచేస్తాం. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఐదేళ్ల కూటమి పాలనలో ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కోవూరు మండలంలోని పడుగుపాడు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఏడాది కాలంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు, ఇళ్ల స్థలాలు కావాలని కోరుతూ ప్రజలు యిచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ఇళ్ల స్థలాలు పంపిణీలో జాప్యం జరుగుతుందని త్వరలోనే అర్హులకు న్యాయం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే సుపరిపాలంలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతున్నానన్నారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్ళి చంద్రబాబు పరిపాలనలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను మనం ప్రజలకి తెలియ చేయాలని కోరారు. ఐదేళ్లుగా అస్తవ్యస్తం అయిన పరిపాలనను చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాకా 3 వేలున్న వృద్ధాప్య పెన్షన్ 4 వేలు, మానవతా దృక్పధంతో దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు చేసి 6 వేలుకు పెంపు, మహిళకు ఉచితంగా 3 సిలెండర్లు, ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం లాంటి సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. విద్యాశాఖా మంత్రి లోకేష్ సారథ్యంలో మెగా డిఎస్సి ద్వారా కొత్తగా 16 వేల 347 మంది టీచర్స్ రిక్రూట్ చేసుకొని గతంలో నాగుగైదు క్లాసులకు ఒక టీచర్ విధానాన్ని రద్దు చేసి క్లాసుకు ఒక టీచర్ విధానం పెట్టడం ద్వారా ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన ఎన్నికల నినాదమైన అవినీతి రహిత వివాద రహిత కోవూరు నినాదాన్ని ఆచరణలో అమలుకు కృషి చేస్తున్నానన్నారు. టిడిపి మండల అధ్యక్షులు పుల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు జెట్టి మదన్మోహన్ రెడ్డి, డీసీఎం శ్రీనివాసులు నాయుడు, పెంచలయ్య బత్తల రమేష్, రాఖి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రసన్న ఇంటి పై దాడి

**నెల్లూరు క్రైమ్ జులై 7, ప్రభాతవార్త :** కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం దాడికి పాల్పడ్డారు. స్థానిక సుజాతనగర్ లోని ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం సాయంత్రం రాళ్ల దాడి చేయడంతో పాటు లోపలికి ప్రవేశించి కొన్ని వస్తువులను పగలగొట్టారు. కోవూరులో జరిగిన వైసిపి కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడిన కొన్ని వ్యాఖ్యలే ఈ దాడికి కారణంగా అందరూ భావిస్తున్నారు. కొవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పై ఈ సమావేశంలో ప్రసన్న కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన కొందరు టిడిపి కార్యకర్తలు, ఈ దాడికి పాల్పడినట్లు అందరూ భావిస్తున్నారు. ఈ సంఘటన పై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

## మంత్రి నారా లోకేష్ కు కలెక్టర్ ఘనమైన స్వాగతం



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నెల్లూరు పర్యటన సందర్భంగా సోమవారం మంత్రి లోకేష్‌కు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఘనమైన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి కలెక్టర్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు.

# రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు

- చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యం - ఏడాదిలో రెండు సార్లు మెగా పేరెంట్స్,టీచర్స్‌మీట్ - పి4 లో భాగమై పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి - విఆర్‌హైస్కూల్ ప్రారంభోత్సవంలో మంత్రి నారాలోకేష్ వెల్లడి





**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త-విద్య :** రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తసుకువస్తునామని రాష్ట్ర విద్య,ఐటీశాఖమంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్థానిక విఆర్‌సి సెంటర్‌లో ఆధునీకరించిన విఆర్‌పాఠశాల ప్రారంబోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలగావించి పాఠశాలను ప్రారంభించారు.తోలుత లోకేష్ ఆయన సహచర మంత్రులైన నారాయణ, ఫరూక్,ఎంపీ వేమిరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్మేలతో కలిసి పాఠశాల భవనాలను, అక్కడ అందిస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. హైడ్రోఫోనిక్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ప్లేగ్రౌండ్స్, తదితరాలను సందిర్శంచి సిబ్బందితో మాట్లాడారు. ఆట స్థలంలో క్రికెట్, వాలీబాల్ ఆడి సరదాగా గడిపారు. అనంతరం ఆయన విద్యార్దుల తల్లింద్రులను ఉద్దేశించిమాట్లాడారు. 150ఏళ్ల చరిత్ర గలిగిన విఆర్‌సి పాఠశాల గత పాలకుల నిర్లక్ష్యంతో మూతపడిందన్నారు. పట్టుదలకు మారుపేరుగా ఉన్న మంత్రి నారాయణకృషితో నేడు విఆర్‌సి ఎంతో అద్భుతంగా రూపుదిద్దుకోవటం జరిగిందన్నారు. ప్రయివేట్ , కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ఈ పాఠశాలను తయారు చేసేందుకు కృషిచేసిన మంత్రి నారాయణ కుమార్తె షరణిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల ముందు అడ్మిషన్లు లేవు అనే బోర్డులు చూస్తుంటే విద్యాశాఖమంత్రిగా తనకెంతో సంతృప్తి వచ్చిందని, రాష్ట్రంలో 9600 పాఠశాలలను ఏర్పాటుచేశామని, విలువలతోకూడిన విద్యాబోధన అవసరమని గ్రహించి చాగంటి వారి రచనలను పాఠపుస్తకాల్లో పొందుపరచటం జరిగిందన్నారు. ఉపముఖ్యమంత్రి పదేపదే చెప్పినట్లుగా విద్యార్దులకు మెక్కల ఆవశ్యకత తెలిసేలా చేయ్యాలన్నారు. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమౌతుందని, విద్యార్దులు చెడు వ్యవనాలకు దూరంగాఉంటూ క్రమశిక్షణతోరాణించి ఉన్నత శికరాలకు చేరుకోవలని సూచించారు.అ లాగే వివిధ రకాల వ్యాపారాల్లో, రంగాల్లో అభివృద్ది చెందిన వారు పి4లో భాగమై రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖలో మార్పులు తీసుకువచ్చి విద్యార్దుల్లో మార్పులు తీసుకురావాలనే ఈ విద్యాశాఖను తాను స్వీకరించటం జరిగిందని తెలిపారు.విద్యార్ధుల చదువు, పాటలు పాటలు తదితర వివరాలను విద్యార్దుల తల్లిదండ్రులకు వివరించేందుకు ఏడాదికి రెండు సార్లు మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్స్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. అలాగే తమకు విద్యాబుద్దులు నేర్పించమని కమిషనర్‌ను కోరిన పిల్లలను దత్తత తీసుకుని తాను ప్రత్యేక చోరవతో చదివింస్తామని హామీ ఇచ్చారు. విఆర్‌సి తోపాటూ సంస్కృత పాఠశాలను దత్తత తీసుకున్న డిఎస్ఆర్, ఆర్‌ఎస్ఆర్‌ను దత్తత తీసుకున్న ఎంపీ వేమిరెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి నారాయణ మాట్లాడుతు గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్దను అస్దవ్యస్తం చేసిందని, విద్యావ్యవస్దను పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు నిదర్శనమే విఆర్‌సి పాఠశాల అని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా మూసివేసిన విఆర్‌సిని ఆధునీకరించి ప్రారంభించటం జరిగిందన్నారు. పి4లో భాగంగా ఎన్‌సిసి అధినేత రాజు, తమ కుమార్తే షరణిలు ముందుకు వచ్చి ఆదునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో నగరంలోని 94వేల ఇళ్లలో 84వేల్ల ఇల్లు తిరిగి పేదల కష్టాలను స్వయంగా పరిశీలించామని, వీరికి మంచి చేయ్యాలనే విఆర్‌ను పునఃప్రారంబింబచేశామన్నారు. తానుకూడా ఇదే పాఠశాలలో 6నుండి డిగ్రీ వరకు చదివానని, అనంతరం ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించామన్నారు. సుమారు 6800మంది ఇక్కడ చదువుకునే వారిని వారి సృతులను గుర్తుచేసుకున్నారు. ఈ పాఠశాల పునఃప్రారంభంగురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్‌లకు చెప్పగానే అనుమతులు మంజూరుచేయటం జరిగిందన్నారు. అందరూ పి4లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జ్‌మంత్రి ఫరూక్ మాట్లాడుతు పేదలకు సేవ చేయ్యాలని మంత్రి నారాయణ విఆర్‌ను పునఃప్రారంబించటం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే మెగా డిఎస్సీని నిర్వహించి 16వేల పోస్టులను భర్తీచేసేందుకు మంత్రి లోకేష్ చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతు రాష్ట్ర విద్యావ్యవస్దలో మంత్రి లోకేష్ సమూల మార్పులు తీసుకువచ్చి నూతర ఓరవడికకు శ్రీకారం చుట్టారని, ఇదుకు నిరద్శనమే విఆర్ పాఠశాల ఆదునీకరణ అని తెలిపారు. విఆర్ మానేజ్‌మెంట్‌లో 45 సంవత్సరాలుగా ఉంటూ విద్యార్దుల అభివృద్ధికి కృషిచేశామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిమాట్లాడుతు విద్యాశాఖ మంత్రిగా లోకేష్‌కు అన్నీ విషయాల్లో లోతైన అధ్యయనం, అవగాహ ఉందన్నారు. తాము కూడా దత్తత తీసుకున్ని ఆర్ ఎస్ఆర్‌ను సుందరంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమెహన్‌రెడ్డి, కావ్యకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాన్‌చక్రవర్తి, వక్స్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, సివిల్‌సప్లయిస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాబిరామిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌ఆర్ పాఠశాలను అభివృద్ధి చేసి చూపిస్తా



- ఎంపీ వేమిరెడ్డి - మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ఆర్‌ఎస్ఆర్ పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన
- విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి - పాఠశాలను దత్తత తీసుకున్న ఎంపీని సత్కరించిన నారా లోకేష్

**నెల్లూరు రూరల్, జులై 7, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పి4లో భాగంగా నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్‌ఎస్ఆర్ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేపడతామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా వి ఆర్ పాఠశాల ప్రాంగణంలో శంకుస్థాపన చేశారు. పాఠశాలను దత్తత తీసుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని నారా లోకేష ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 విధానంలో స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్‌ఎస్ఆర్ పాఠశాలను దత్తత తీసుకున్నానని, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తప్పకుండా అభివృద్ధి చేసి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తామన్నారు. మెరుగైన వసతులు కల్పిస్తామని ఎంపీ ప్రకటించారు. విఆర్ పాఠశాల 2019 - 24 మధ్య పాఠశాలను నాశనం చేశారన్నారు. మంత్రి నారాయణ చొరవతో పాఠశాల అద్భుతంగా తయారయ్యిందన్నారు. ఈ రోజు 1050 మందికి విఆర్ పాఠశాలలో ఉచిత లభిస్తోందని అన్నారు. మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ తీర్చిదిద్దుతున్నారన్నారు. లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) కింద రాష్ట్రంలో వినూత్న, డిజిటల్ విద్యను తీసుకువస్తున్నారన్నారు. పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందిస్తున్నారన్ని వివరించారు. పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి మన జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పిల్లల చదువులపై వారి తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు.

# 10న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0

- తల్లిదండ్రులు తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలి
- మెగా టీచర్స్ పేరెంట్ సమావేశంలో స్కూలు అభివృద్ధి కమిటీ మెంబర్లు విధిగా పాల్గొనాలి
- జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపు



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్న వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఒకసారి ఈ మీటింగ్ ను నిర్వహించామని, రెండోసారి 10న జిల్లావ్యాప్తంగా 3600 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలతో పాటు 143 కళాశాలలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ట్లు చెప్పారు. మీటింగ్ రోజున విద్యార్థులు, తల్లిదం డ్రులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల బోధన సామర్థ్యాలను వారికి ఉపాధ్యాయులు తెలియజేస్తారన్నారు. విద్యార్థుల ప్రతిభను తెలిపే ప్రోగ్రెస్ కార్డులను కూడా అందిస్తారని చెప్పారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారు, పాఠశాలలో క్రమశిక్షణతో ఉంటున్నారా, ఏయే సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారు. మొదలైన అంశాలను తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని సోషల్ ఫారెస్ట్ ద్వారా నిర్వహిస్తామన్నారు. స్కూల్ ప్రాంగణంలో గానీ లేదా అణువైన ప్రాంతాల్లో చెట్లు నటించి రెండు సంవత్సరాలు పాటు వాటిపై శ్రద్ధ వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సుమారు మూడున్నర లక్షల మంది విద్యార్థులు మన విద్యా వ్యవస్థలో విద్యను అభ్యసిస్తున్నారని, వారి ప్రతిభ పాటవాలను మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పకుండా ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండుగ కోసం కూటమి ప్రభుత్వం రూ.10కోట్లు ఖర్చు పెట్టింది

- తెలుగువారు ఎక్కడున్నా సంతోషంగా ఉండాలి
- నెల్లూరులో బారా షహీద్ దర్గా రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి లోకేష్ - ఆరోగ్యం రొట్టెను స్వీకరించిన మంత్రి



**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త** రొట్టెల పండుగ కోసం కూటమి ప్రభుత్వం రూ.10కోట్లు ఖర్చు పెట్టిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంత సామరస్యానికి ప్రతీకైన నెల్లూరు నగరంలోని బారా షహీద్ దర్గా రొట్టెల పండుగలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా దర్గా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు కూటమి ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బారా షహీద్ దర్గాను సందర్శించారు. ముస్లిం మత పెద్దలు నారా లోకేష్‌కు గలఫ్‌ను అలంకరించారు. దర్గాలో ఉన్న మహ్మద్ ప్రవక్త అనుచరులు 12 మంది అమరవీరుల చిహ్నాలపై చాదర్‌లను కప్పి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం స్వర్ణాల చెరువులో ఆరోగ్యం రొట్టెను స్వీకరించి మంత్రి పి.నారాయణ, మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలకు పెంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ సంతోషంగా ఉండాలని చక్కటి పాలన అందిస్తున్నాం. 2014 తర్వాత రొట్టెల పండుగ అద్భుతంగా జరిగేది. ఆనాడు నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు నిధులు కేటాయించారు. అనేక పనులు చేపట్టారు. ఈ సారి కూడా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. రూ.10 కోట్లు ఈ కార్యక్రమం కోసం కూటమి ప్రభుత్వం ఖర్చు పెట్టడం జరిగింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆలోచన ఒక్కటే.. తెలుగువారు ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని, దేవుడు ఆరోగ్యంగా చూసుకోవాలనే లక్ష్యంతో మేమంతా ప్రార్ధిస్తూ ఉంటామన్నారు. ఈ రోజు రొట్టెల పండుగలో ఏ రొట్టె తీసుకోవాలనేది భాగా చర్చించా. నేను బలంగా నమ్మేది బాబు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. అందుకే ఆరోగ్యం రొట్టెను తీసుకోవడం జరిగింది. ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి ఉండాలి. ఏ బాధ్యతతో అయితే ప్రజలు గెలిపించారో దానిని నెరవేరుస్తాం. అహర్నిశలు ప్రజల కోసం పని చేస్తాం. ఎక్కువ మంది మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలు ఉన్నారు. మత్రి వర్గంలో 17 మంతి కొత్త వారు ఉన్నారు. కసితో పని చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. నాలుగేళ్లలో అనేక అభివృద్ది, సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు.

## సహజ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్



**దగదర్తి, జులై 7, ప్రభాతవార్త :** దగదర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సహజ వ్యవసాయ ఉత్పత్తులతో సోమవారం మార్కెట్‌ను నిర్వహించారు. ఈ పద్దతిలో సహజ రైతులు పండించిన తాజా కూర గాయాలు, ఆకు కూరలు, ఇడ్లీ రవ్వ, ఎర్ర మిరప పొడి, ఆవకాయ పచ్చడులు వంటి ప్రామాణిక ఉత్పత్తు లు విక్రయించబడ్డాయి. ఈ మార్కెట్‌లో వైద్యులు డాక్టర్ అఖిలతో సహా ఆసుపత్రి సిబ్బంది సహజ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. రైతులు కృషికి ప్రోత్సాహం కల్పిస్తూ, దగదర్తి మండలంలోని ప్రభుత్వ అధికారులు, రైతు సాధికార సంస్థ సభ్యులు ఈ కార్యక్రమ నిర్వహణకు సహకారం అందించారు.

## మాలేపాటిని కలిసిన పలు పంచాయతీల వాసులు



**దగదర్తి, జులై 7, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలోని మాలేపాటి స్వగృహం నందు సోమవారం అందుబాటులో ఉన్నటువంటి మాలేపాటి బ్రదర్స్‌ను మండలంలోని ఆయా పంచాయతీల ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కలవడం జరిగింది. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు మాట్లాడుతూ నమ్ముకున్న ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తామని, ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికి అండగా నిలుస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వచ్చిన వారందరికి భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. వీరితో పాటు మండల పార్టీ నాయకులు మాలేపాటి సుధాకర్, కంచర్ల కృష్ణ, పేపాల సూరిబాబు, వట్టిగుంట గోపాల్, ముప్పాల వెంకటేశ్వర్లు, వర్ధినేని కృష్ణ, బత్తుల ఏడుకొండలు, దుండిగం పంచాయతీ నుండి కోనంకి శివయ్య, చెన్నూరు పంచాయతీ పి.రమణమ్మ, అంకబాబు, శ్రీనయ్య, వెంకటరావు, తడకలూరు పంచాయతీ నుండి పెళ్లూరు వెంకటేశ్వర్లు, ఆత్మకూరు శ్రీకాంత్, తురిమెర్ల పంచాయతీ నుండి అల్లం రమేష్, హరి, బ్రహ్మ పెదపుతేడు పంచాయతీ నుంచి గోపాలయ్య, లింగాలపాడు గ్రామం నుండి ఎం.వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, ఎలమంచిపాడు పంచాయతీ పరంధామయ్య, రవి, రంగ సముద్రం నుండి ప్రభాకర్, మణి, మారెళ్ళపాడు కృష్ణ, కాట్రాయపాడు ఎల్.మల్లిఖార్జున, అత్యధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం



**వింజమూరు, జులై 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఏడాది కూటమి ప్రభుత్వం పాలన అభివృద్ధి పథంలో దూసు కెళ్తుందని తెలుగుదేశం పార్టీ మండల మాజీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల ంలోని నందిగుంట గ్రామ కమిటీ అధ్యక్షులు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు చిలకల వెంకటరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగపట్ల వెంగయ్య ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేసి చూపారన్నారు. నంది గుంటలోని ప్రతి ఇంటికి తిరిగి ఏడాది సుపరిపాలన కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వంను ప్రజలు ఆశీర్వదించి ఓటు అనే ఆయుధంతో గత అరాచక పాలన ప్రభుత్వంను సాగనంపి కూటమి ప్రభుత్వంకు పట్టం కట్టారు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ హామీలన్ని అమలు చేయటం జరుగుతుందన్నారు. అన్నమాట ప్రకారం పింఛన్ 4000 పెంచారన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇవ్వడం జరిగిందన్నారు. మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అలాగే ఆగష్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఈనెలలోనే అన్నదాత సుఖీభవ మెగా డీఎస్సీ ద్వారా 13 వేల టీచర్ ఉద్యోగులు భర్తీ చేయటం జరిగిందన్నారు. కానీ గడిచిన ప్రభుత్వ పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేసిన పాపాన పోలేదన్నారు. నేడు అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాడు అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుపరిపాలన అందిస్తున్నాడన్నారు. సుపరిపాలన తొలి అడుగు ప్రజా విజయంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విద్యావంతుడు కావడంతో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని సంకల్పంతో కుగ్రామంకు సైతం వెళ్లి అక్కడ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తూ ప్రజలు మన్ననలు పొందుతున్నాడు అన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా ప్రజలతో మమేకమైన వారు లేరన్నారు. నేడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తాను పర్యటించిన ప్రాంతాలలో అభాగ్యులకు పేదలకు ఇప్పటికి తన సొంత నిధులను ఉదారంగా అందిస్తూ ప్రజలు మనిషిగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనంగి రమణయ్య, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు చల్లా శ్రీనివాస్ యాదవ్, మండల కోకన్వీనర్ మంచాల శ్రీనివాస్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు చేబ్రోలు వసతరావు, భోజనపు ఆనంద్, యూనిట్ ఇన్‌ఛార్జీ కొండపల్లి వెంకటేశ్వర్లు, తాలూరి రమణయ్య, స్థానిక నాయకులు చిలకల మాల్యాద్రి, యలమందయ్య, ఇతర నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వింజమూరు, జులై 7, ప్రభాతవార్త :**



వింజమూరు బంగ్లా సెంటర్ నందు ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఎగరవేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జీ మందా వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా ఎమ్మెస్పి అధ్యక్షులు పందిట అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించి నేటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుని 31వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేయాలని, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపునివ్వడంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలియజేశారు. ఉద్యమం పురుడు పోసుకొని ఎన్నో ఒడిదుడుకులను ఆటు పోటులను తట్టుకొని, మాదిగ జాతి గౌరవాన్ని, నిలిపిన మహోన్నతమైన వ్యక్తి మంద కృష్ణ మాదిగ అని వారు కొనియాడారు. మొదటి తరం ఉద్యమ నాయకులను వారు ఘనంగా శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంద సుజాత, మండల నాయకులు, గ్రామ కమిటీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**ఆత్మకూరు, జులై 7, ప్రభాతవార్త:**



మం దలంలోని నారంపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సి.హెచ్. నరేంద్రరెడ్డి బదిలీపై మండలంలోని చెర్లో యడవల్లి పాఠశాలకు బదిలీపై వెళ్ళారు. ఈసందర్భంగా సోమవారం నరేంద్రరెడ్డిని నారంపేట పాఠశాల ఉపాధ్యా యులు, గ్రామస్తులు , విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరి నాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రరెడ్డి గత 8సంవత్సరాలుగా క్రమశిక్షణతో కర్తవ్య నిర్వహణ చేశారని,విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించారని , నాడు-నేడు ద్వారా పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. తమ గ్రామంలో పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడం గర్వకారణమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు .విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో నరేంద్రరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.సురేంద్రరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు టి.సురేష్, ఎ.వెంకటేశ్వర్లురెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి,ఎస్ శివరామిరెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మెన్ శ్రీనివాసులు,అంగన్‌వాడీ కార్యకర్త ఎం.లక్ష్మీప్రసన్న, గ్రామస్తులు పెంచలరావ్, సుధీర్,రామయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చేజర్లలోని మడపల్లి వసంతమ్మ భూమిని అక్రమంగా దున్నేయడం అన్యాయం

**- దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి చేజర్ల**



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త :** మండలంలోని మడపల్లి గ్రామానికి చెందిన వసంతమ్మ భూమిని అక్రమంగా దున్నేయడం అన్యాయం అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి జాయింట్ కలెక్టర్‌కు అర్జీ అందచేసారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ చేజర్ల మండలంలోని మడపల్లి గ్రామంలో పెన్నాతీరంలో సాగుబడి చేసుకుంటున్న భూమిని ధ్వంసం చేసారని తెలిపారు. 30 మంది అగ్ర కులాలవి ధ్వంసం చేయకుండా కేవలం వసంతమ్మ భూమికి సంబంధించిన భూమికి కరెంట్ కట్ చేసి ఆ భూమిని దున్నేసారని తెలిపారు. ఒక్క పెద్ద నాయకుడు పెన్నా తీరంలో ఇసుక భూమి ఉందని ఇసుకను కొల్ల గొట్టడానికి ఒక దళిత ర్యాలెన వసంతమ్మ భూమిని మామలుగా చదును చేసి ధ్వంసం చేసారని తెలిపారు. ఈ విధంగా పేదవారు సాగు చేసుకుంటున్న భూమిని ఇసుక మాఫియా ఇసుకను కొల్లగొట్టడానికి భూమిని ధ్వంసం చేసారనిఅన్నారు. 20 సంవత్సరాల నుండి సాగు బడి చేసుకుంటున్న భూమిని ఆత్మకూరు నాయకుడి ఆదేశాలతో కరెంట్ కట్ చేసి అనుచరులకు ఇసుక తరలించడానికి అవకాశం ఇచ్చారని తెలిపారు. ఇసుక మాఫియాను అరికట్టి పేదల భూములు కాపాడి వసంతమ్మకు న్యాయం చేయాలని బాధితులతో పాటు దళిత నాయకులు బిల్ల మస్తానయ్య, లింగంగుంట శ్రీనివాసులు, కోవూరు దాసు, పి పోలయ్య, ఎస్‌కె భాషా, కె అంకయ్య పాల్గొన్నారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళులు



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం కోవూరు మండలం పడుగుపాడులోని రుక్మిణి కళ్యాణ మండపంలో జరిగిన కోవూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి , రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ జెడ్పీ చైర్మన్ వెంకటరెడ్డి, కోవూరు నియోజకవర్గ వైసీపీ యువనాయకులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, యాక్టివ్ కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## చెత్త తరలింపులో అలసత్వం వద్దు



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలు ఉన్న గ్రామ పంచాయతీల్లో సకాలంలో చెత్తను తొలగించి తద్వారా సంపద సృష్టించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు గృహాలకు సంబంధించిన యాజమానులతో మాట్లాడి ఐవీఆర్ఎస్ కాల్స్ సర్వేపై అడిగి తెలుసుకున్నారు. మీ ఇంట్లోని చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్లకు తడి చెత్త పొడి చెత్త రూపంలో వారికి అందజేయాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

## సీపీఐ నియోజకవర్గ మహాసభను విజయవంతం చేయాలి



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ భారత కమ్యూనిస్టు పార్టీ 17వ మహాసభ జులై 22వ తేది నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో సీపీఐ గోడ పత్రికలను సీపీఐ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 22వ తేది ఉదయం స్థానిక బజార్ సెంటర్‌నుంచి భారీ ప్రదర్శన ఉంటుందని అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సభ నిర్వహించడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నేతలు రమణయ్య, ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్, ఎరుకుల రాష్ట్ర పోరాట సమితి నేత వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, విజయకుమార్, చిన్న, మురళి, సారథి, రాజా, తదితరులు ఉన్నారు.

## ఘనంగా షిరిడీ సాయినాధునికి పూజలు



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో 23వ గురుపూర్ణిమ సప్తాహ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేక పూజలు సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దేగపూడి రామచంద్రారెడ్డి, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం సాయి సత్సంగం, భజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ధర్మకర్తలు డాక్టర్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి, రుత్వికులు పద్మనాభ స్వామి, శేఖర్ స్వామి, భక్తులు ఉన్నారు.

## డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యంకు నివాళి



**ఇందుకూరుపేట, జులై 7, ప్రభాతవార్త :** మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో గాంధీ ఆశ్రమానికి సేవలందించినటువంటి రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంతాపదినం ఏర్పాటు చేయటం జరిగింది. ప్రముఖ గాంధేయవాది, పల్లిపాడు గ్రామ వాసి ఆ తర్వాత విశాఖ పట్నంలో స్థిరపడిన డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం(81) అస్వస్థతతో ఆయన ఈ మధ్య కాలంలో స్వర్గస్తులయ్యారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలోని పినాకిని గాంధీ ఆశ్రమంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉండేది. గాంధేయవాదాన్ని ఆయన ప్రచారం చేసేవారు. తన 78 ఏళ్ల వయసులో కూడా ఆయనెంతో పట్టుదలతో పర్సప్షన్ ఆఫ్ స్టూడెంట్ యూత్ ఆన్ మహాత్మాగాంధీ-ఏ స్టడీ ఇన్ ఆంధ్ర యూనివర్సిటీ అనే అంశంపై పీహెచ్‌ఏ పూర్తి చేసి, గాంధీజీ పట్ల తనకున్న శ్రద్ధా భక్తులు చాటుకున్నారు. పల్లిపాడు గ్రామంలో ఉన్నటువంటి మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి ఒకప్పుడు కమిటీ మెంబరుగాను ఆహ్వాన కమిటీ చైర్మన్ గాను పని చేశారు. అదే విధంగా ఆన యుక్త వయసులో ఉన్నప్పటి నుంచి మన గాంధీ ఆశ్రమానికి ఎనలేని కృషి చేశారు. ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంని గాంధీ ఆశ్రమానికి తీసుకువచ్చారు. సబర్మతి ఆశ్రమం, ఉత్తర భారతదేశంలో ఉన్నటువంటి ప్రముఖ గాంధీయవాదులను, అదే విధంగా ప్రముఖులను గాంధీ ఆశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని, గాంధీ ఆశ్రమానికి ప్రతి సందర్భంలోనూ వారిని తీసుకొస్తుండేవారు. గాంధీ జయంతి, వర్ధంతి అనేక సభలను జయప్రదం చేసేవారు. అలాంటి ఉన్నత విలువలు కలిగిన, గాంధీ ఆశ్రమం అభివృద్ధి గురించి నిరంతరం ఆలోచించే వ్యక్తి ఇంకా మన మధ్య లేరు అని అదే విధంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ 2 నిమిషాలు మౌనం పాటించారు. పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు, గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు జీవీ రామిరెడ్డి, కందికటు రాజేశ్వరి, గంపల మంజుల, గంట విజయశ్రీ, షేక్ అల్లాబక్షు, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్రహ్మణ్యం, రావిప్రోలు సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద గ్రేడ్ 3 సచివాలయం ఉద్యోగులు నిరసన



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త :** సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రేడ్ 3 సచివాలయం వాళ్లు ఐదు సంవత్సరాల నుండి జనరల్ ట్రాన్స్ఫర్స్ కౌన్సిలింగ్ ఉపాధి కల్పించాలని కానీ మరల రీకౌన్సిలింగ్ చేపడతామని అంటున్నారని కలెక్టర్ కార్యాలయం దగ్గర ఏఎన్ఎంలు అధిక సంఖ్యలో వచ్చి ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. సాధారణంగా, గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2 ప్రమోషన్ తీసుకున్న వంటి వారు పని చేసిన సచివాలయం వెకెంట్ చూపించకుండా వాళ్ల ప్రమోషన్ సబ్ సెంటర్స్ వెళ్లకుండా వాళ్ల ప్రస్తుతం స్థలాల్లోనే ఉంటున్నారని ఏఎన్ఎంలు తెలిపారు గత నెల 30వ తేదీ రాత్రి సమయంలో తమకు కౌన్సిలింగ్ నిర్వహించారని ప్రమోషన్ తీసుకున్న ఎంపీ హెచ్ఎఫ్ గా ఉన్న వారిని వారి యొక్క సబ్ సెంటర్స్ కు రీబాక్ చేయాలి అని, తమకు జరిగిన ఫ్రీ కౌన్సిల్ ప్రకారమే పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారమే ఖాళీ ప్లేసులు మేము ఎంచుకున్నామని, వాళ్ల సబ్ సెంటర్స్ కు వెళ్లే వరకు ఎటువంటి కౌన్సిలింగ్ జరపకూడదని జరిపిన గత నెల 30వ తేదీ జరిగిన కౌన్సిల్ ప్రకారం తమకు విధులు నిర్వహించాలని కోరారు.

## ఆకట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి సైడ్ లైట్స్



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :**కోవూరు మండలం పడుగుపాడులోని రుక్మిణి కళ్యాణ మండలంలో వైసీపీ పార్టీ కోవూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు ఈ సమావేశ మందిరంలో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేకంగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి దాని ద్వారా గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఏమేమి హామీలు ఇచ్చాడో అందులో ఏమి నెరవేరలేదనే విషయాలనే పూర్తిస్థాయిలో అర్థమయ్యే రీతిలో వివరించేలా వీడియో ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీంతో పాటు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి .. చంద్రబాబు చేసిన అలవికాని హామీలు, మోసాలు , వీటితో పాటు ఈ సంవత్సర కాలంలో ఏమి చేశారు.. ఏమి చేయలేదని విషయాలను ఉదాహరణ పూర్వకంగా సమావేశంలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలకు అర్థమయ్యే రీతిలో వివరించి వారి మన్ననలు పొందారు. సమావేశంలో ఏర్పాటు చేసిన ఈ సైడ్ లైట్స్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఇందుకు ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## చెరువుల మరమ్మత్తులకు నిధులు మంజూరు: డీఈ



**ఉదయగిరి, జులై7 ,ప్రభాతవార్త :** ఉదయగిరిలోని గండిపాలెం సబ్ డివిజన్ పరిధిలో శాసనసభ్యులు కాకర్ల సురేష్ సహకారంతో 24 పనులకు గాను చెరువుల మరమ్మత్తులకు కోటి పదకొండు లక్షలు నిధులు మంజూరు అయ్యాయని ఉదయగిరి నీటిపారుదల శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. గండిపాలెంలోని పుణ్యబోయిన చెంచురామయ్య జలాశయ మరమ్మత్తులకు 14 పనులకు గాను 79 లక్షల రూపాయలు అలాగే ఉదయగిరి మండలంలోని ఐదు చెరువులకు 16 లక్షల రూపాయలు వాటిఓల తిరుమలాపురం బండగానిపల్లి, లింగమనేనిపల్లి, దాసరిపల్లి, పుల్లయ్యపల్లి, చెరువులు ఉన్నాయని, సీతారామపురం మండలంలో ఐదు చెరువులకు 16 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని వాటిలో స్వామి చెరువు ఊర చెరువు మర్రి ఓట్ల రిజర్వాయర్ మారంరెడ్డి పల్లి చెరువు పబ్బులేటి పల్లి చెరువు ఉన్నాయని వీటిని నెలాఖరు లోపల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అదే విధంగా చెరువులలోని మట్టి రైతులు తరలించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని ఒక ట్రాక్టర్‌కు కేవలం మూడు రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి ఎన్ని ట్రాక్టర్లు కావాలన్నా తీసుకెళ్లవచ్చని అయితే రైతును ధృవీకరించే పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, నకల కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు.

## సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారం



**ఉదయగిరి, జులై 7, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని ఉదయగిరి మాదిగపాలెంలో సోమవారం ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి శాస నసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఉదయగిరి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారం ఉదయగిరిలోని మాదిగపాలెంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ నరసింహులు, ఉప్పుటూరి పెద్ద వెంకటయ్య, నల్లిపోగు నరసింహులు, నల్లిపోగు రాజా, మాట్ల నాగయ్య ,కొండలరావు, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురించి వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది.

## విద్యార్థులకు నగదు పురస్కారాలు



**అనుమసముద్రంపేట, జులై 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట లోని ఠాగూరు ఇంగ్లీష్‌మీడియం స్కూల్ నందు సోమవారం 2024-25 విద్యా సంవత్సరం లో 10వ తరగతి లో ప్రథమ, ద్వితీయ , తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమ తులను అందించారు. ఈ ప్రోత్సాహక బహుమతుల్లో ప్రథమస్థానం సాధించిన ఎం.డి .అప్సాకు పొనుగోటి మధుసూధన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి,లు వారి తండ్రి మనోహర్‌రెడ్డి 10వేలు రూపా యలు, వైసిపి మండల కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ సందానిబాషా 10 వేల రూపాయలు ప్రైజ్‌మనీని అందజేశారు. స్కూల్ ద్వితీయస్థానం సాధించిన సోమల సంజీవనికి ఠాగూరు పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు ఆయన భార్య సత్యవతమ్మ జ్ఞాపకార్థం 10వేల రూపాయలు, సయ్యద్ సందాని బాషా 10వేల రూపాయలు క్యాష్ ప్రైజ్ అందించారు. పాఠశాల తృతీయస్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులు మద్దు హనిప్రియ, జొన్నలగడ్డ మధులేఖలకు సయ్యద్ సందానిబాషా 6వేల రూపాయలు క్యాష్‌ప్రైజ్ అందజేశారు. మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలో చదువుకొని ఎంతో ఉన్నతస్థానానికి చేరానని , ఈపాఠశాలలో మంచి వసతులతోకూడిన క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. కావున ఈ అవకా శాన్ని వినియోగించుకొని మంచి విద్యార్థులు గా పెంపొందాలన్నారు. క్రమశిక్షణతో మెలాలని ఈ బహుమతిని తమ తల్లిదండ్రుల పేరుమీద ఇస్తున్నా నన్నారు. విద్యార్థులు ఎప్పుడు తల్లిదం డ్రులను, గురువులను గౌరవించా లన్నారు. సందానిబాష మాట్లాడు తూ తాను పిల్లల అభివృద్ధికి తన వంతు సహకారం చేస్తానని, గతంలో ఈ పాఠశాల విద్యార్థి ఎస్.కె.అర్షియ 10వ తరగతిలో ప్రథమస్థానం సాధిఅంచినందుకు 20 వేలరూ పాయలు కాష్ అవార్డు అందించామన్నారు. ఠాగూరు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు పి.నాగభూషణం మాట్లా డుతూ పిల్లలకు గత రెండు సంవత్సరాలనుంచి 10వ తరగతిలో ఉత్తమ విద్యార్థులకు తన భార్యసత్యవతి జ్ఞాపకార్థం 10వేల రూపా యలను క్యాష్ అవార్డు అందించి పిల్లల్లో కాంపిటీషన్ స్పిరిట్‌ని డెవలప్ చేసేందుకు తనవంతు సహకారం అందజే స్తున్నానన్నారు.ఓపాఠశాల డైరెక్టర్ ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామిరెడ్డి, కరస్పాండెంట్ సి.హెచ్.వి. రమణారెడ్డి, కరస్పాండెంట్‌సి .హెచ్.వి.రమణారెడ్డి, ఉపాఠశాల ఉపాధ్యాయినిలు, ఉపాధ్యాయులు,విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌కి ఆత్మీయ ఆహ్వానం పలికిన బీద



**నెల్లూరు, జులై 7 ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు పర్యటనకు విచ్చేసిన యువ నాయకుడు, రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి శాసన మండలి సభ్యులు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆత్మీయ ఆహ్వానం పలికారు.

## చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు జులై 7 ప్రభాతవార్త** :కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో 1.20 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న సబ్ ట్రెజరీ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎస్టీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో పాటు త్వరితగతిన భవన నిర్మాణ పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కార్యాలయ ఉద్యోగి మధు, ఉన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అన్ని అబద్దాలే

- నెరవేరని హామీలు



**కోవూరు జులై 7 ప్రభాతవార్త** : అలవికాని అబద్దాలతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సంవత్సరం కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు డాక్టర్ పి. అనిల్‌కుమార్ యాదవ్ ఘాటుగా విమర్శించారు. కోవూరు మండలం పడుగుపాడులోని రుక్మిణి కళ్యాణ మండలంలో వైసీపీ పార్టీ కోవూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఈ కూటమి ప్రభుత్వం అలవికాని హామీలతో పాటు ఈవీఎంల సహకారంతో అధికారంలోకి వచ్చిందే తప్ప ప్రజాభిమానంతో కాదన్నారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రజానీకం 41 శాతం పైగా జగన్‌మోహన్‌రెడ్డి పక్షానే ఉన్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సూపర్ సిక్స్ హామీలంటూ అధికారంలోకి వచ్చిన ఈ కూటమి ప్రభుత్వం పింఛన్ పెంచిందే తప్ప మిగతావి మహిళలకు ఉచిత బస్సుకానీ, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కానీ, ఆడబిడ్డకు ఆడబిడ్డ నిధి కానీ, రైతులకు రైతు భరోసా కానీ నేటికీ అందజేయలేదన్నారు. ఈ సంవత్సర కాలంలో పింఛన్ పెంచడం తప్ప మరే కార్యక్రమం ఈ ప్రభుత్వం చేయలేదని ఎద్దేవా చేశారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక క్యాలెండర్ ఏర్పాటు చేసి దాని ప్రకారం ప్రభుత్వం పథకాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో పడేవన్నారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. కేవలం వైసీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టడమే తప్ప ఈ ప్రభుత్వం సాధించిందేమీ లేదన్నారు. శాసనమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈవీఎంల కారణంగా అధికారంలోకి వచ్చిన ఈ కూటమి ప్రభుత్వం ఈ సంవత్సరం కాలంలో ఒరగబెట్టిందేమీ లేదన్నారు. చెప్పిన హామీలను నెరవేర్చకుండా ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందన్నారు. ఎవరెన్ని అనుకున్నా మరలా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి ఈ రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. ఈ సంవత్సరం కాలంలో ప్రజలు ఈ ప్రభుత్వం చేసిన మోసాల హామీలను తెలుసుకున్నారన్నారు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మరలా వైసీపీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కోవూరు నియోజకవర్గాన్ని గతంలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఉన్న సమయంలో ఏ విధంగా అభివృద్ధి చెందిందో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ప్రస్తుతం ఇసుక దోపిడీ, మట్టి దోపిడీ ఎటు చూసినా మోసాలే తప్ప చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ఇప్పటికే కూటమి ప్రభుత్వం మోసాలను గ్రహించారన్నారు.. నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశారో తమకు తెలుసన్నారు. అటువంటి మంచి వ్యక్తిని ఓడించి ప్రజలు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచి వ్యక్తులను ఓడించామనే బాధ ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. ప్రస్తుతం ఈ సంవత్సర కూటమి పరిపాలనలో రైతులు ఎక్కడా సంతోషంగా లేరన్నారు. ఒకవైపు ధాన్యం పండించిన రైతులు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు మామిడి పండించిన రైతులు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ వైసీపీ యువనాయకులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, యాక్టివ్ కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి . కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన ప్రజాప్రతినిధులు, సీనియర్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పెల్లేరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**చేజర్ల జులై 7ప్రభాతవార్త** : చేజర్ల మండలం పెల్లేరు గ్రామంలో సోమవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొమ్మి సిద్దుల నాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం కొమ్మి సిద్దులనాయుడు మాట్లాడుతు పెల్లేరు గ్రామంలో గడగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తుంటే ప్రజల నుండి అనూహ్యస్పందన లభిస్తుందని అన్నారు. ఏన్‌డిఏ కూటిమి ప్రభుత్వం హయాంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరుగుతుందని అన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం అబివృద్దిని పట్టించుకోలేదని దీంతో రాష్ట్రం తీవ్రంగా నష్ట పోయిందని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజల మీద పెను భారం పడే విధంగా గత ప్రభుత్వం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆర్థిక పరిస్థితి మెరుగు పరచి ప్రజలకు అనేక సంక్షేమపథకాలు అమలు చేస్తుందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, పెంచల ప్రసాద్, హరిబాబు, పెంచలరెడ్డి, రాధాకృష్ణయ్య , శ్రీరాములు నాయుడు, పరంధామయ్య, నాయుడు ప్రసాద్, వెంకటరత్నం, తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ 31 ఆవిర్బావ దినోత్సవం



**సీతారామపురం జులై 7 ప్రభాతవార్త** : ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోంపల్లి గ్రామంలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ మరియు బహిరంగ సభ నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో సీనియర్ నాయకులు నేలటూరు జాషువా అధ్యక్షత వహించగా ఎంఆర్‌పిఎస్ జాతీయ సలహాదారుడు డాక్టర్ కలివెల ఎలిషకుమార్ ,ఉపాధ్యాయ నాయకులు ఏవి రమణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతు స్వాతంత్ర ఉద్యమం తరువాత సుదీర్ఘ ఉద్యమ చరిత్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితికే దక్కిందని చెప్పులు కొట్టిన చేతులతో చరిత్రను తిరగ రాసి భారత రత్న,బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ మైన సామాజిక న్యాయం పోరాటంతోఎబిసి వర్గీకరణ సాధించడం జరిగింది. 30 సంవత్సరాలలో వివిధ దశలలో ఎంఆర్‌పిఎస్ సాధించిన ఉద్యమాలను వివరించడం జరిరింది.కేవలం జాతీ ప్రయోజనాల కోసమే కాకుండా సమాజం లోని అన్ని సామాజిక వర్గములకు మేలు చేసిన ఉద్యమం ఒక్క ఎంఆర్‌పిఎస్ మాత్రమేనని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల కన్వీనర్ కొడవటి కంటి కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినతులు స్వీకరించిన పోలీసు అధికారులు



**నెల్లూరు క్రైమ్, జులై 7 ప్రభాతవార్త** : జిల్లా యస్. పి. జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం సోమవారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశం మందిరంలో నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 47 ఫిర్యాదులు అందినట్లు పోలీసు వర్గాలు తెలిపారు. జలదంకి పరిధికి చెందిన మహిళను తన భర్త మద్యానికి బానిసై ప్రతిరోజు దుర్భాషలాడుతూ తనను, తన పిల్లలు యొక్క కనీస అవసరాలు కూడా చూసుకోకుండా ఇంటికి రాకుండా ఇబ్బందులు గురి చేస్తున్నాడని అదేవిధంగా చిన్న బజారు పరిధికి చెందినటువంటి మహిళను తన భర్త తన తల్లిదండ్రులతో కలిసి వేధించి, అదనపు పట్నం కోసం ఇబ్బందులు గురి చేస్తూ, ఇంటి నుండి గెంటి వేశారని విచారించి, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. కావలి టూ టౌన్ పరిధికి చెందినట్లు వ్యక్తిని, తిరుపతికి చెందిన జయప్రకాష్ అనే వ్యక్తి బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి 14 లక్షలు నగదు తీసుకొని 8 నెలల నుండి ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. కందుకూరు పరిధికి చెందిన వ్యక్తిని, ఒంగోలు కొత్త పట్నంకి చెందిన ఆశా రాణి అనే మహిళ ఆన్లైన్‌లో వ్యాపారం చేస్తే అధిక లాభాలు వస్తాయని, యూరోలుగా మారుస్తానని నమ్మించి, 12.70 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు, నగదు ఇవ్వట్లేదని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కావలి డిఎస్పి శ్రీధర్, డిటిసి ఎస్ఐ నాగేశ్వరమ్మ, ఎస్‌బి 2 సిఐ శ్రీనివాసరెడ్డి కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేలినా గ్యాస్ సిలిండర్ తృటిలో తప్పిన ప్రమాదం

**మనుబోలు జులై 7 ప్రభాతవార్త** : ఉన్నట్టుంది పెద్ద పేలుడు శబ్దం రావడంతో మనుబోలు మండల కేంద్రంలోని బిసి కాలనీ వాసులు సోమవారం ఉలిక్కి పడ్డారు. కాలనీలో మీరా సాహెబ్ ఇంటిలో మిని గ్యాస్ సిలిండర్ పేలడంతో తృటిలో ప్రమాదం తప్పింది.మీరా సాహెబ్ కుటుంబం వంటకు మిని గ్యాస్ సిలిండర్ని ఉపయోగిస్తున్నారు. ఈ నేపద్యంలో వంట చేసి ఆ కుటుంబం వంటకు మిని గ్యాస్ సిలిండర్న ఉపయోగిస్తున్నారు. ఈనేపద్యంలో వంట చేసి ఆ కుటుంబ వ్యాపారం కోసం బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద శబ్దం రావడంతో కాలనీ వాసులు ఉలిక్కి పడ్డారు. సిలిండర్ ముక్కలు,ముక్కలైంది. ఆ సిలిండర్ తాలుకా ఇనుప ముక్కలు దూరంగా పడ్డాయి. ఆ సమయంలో ఎవ్వరు లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వినాయక చవితి ఉత్సవాల సమయంలో బాణా సంచా పేలుళ్ళతో ఒకరు చనిపోగా పలువురికి గాయాలైనది తెలిసిందే. ఇప్పుడిప్పడే కాలనీవాసులు, ఆ పేలుళ్ల నుండి కోటుకుంటున్నారు. ఇదే సమయంలో భారీ శబ్బంతో పేలడంతో ఆంధోళన చెందారు. ఎవరికి ఏమి కాక పోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

## గ్రీవెన్స్‌డేని సద్వినియోగం చేసుకోండి



**మనుబోలు జులై 7 ప్రభాతవార్త** : మనుబోలు మండలం కేంద్రంలోని తహసిల్దారు కార్యాలయంలో సోమవారం నాడు గ్రీవెన్స్ డే నిర్వహించారు.పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తమ సమస్యలను అర్జీలు ద్వారా నిర్ణీత సమయంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ జలజాక్షి ,డిప్యూటి తహసిల్దారు ప్రదీప్,డిప్యూటి ఎండిఒ నారాయణ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షక కమిటీ నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఘన సన్మానం



**నెల్లూరు సిటీ, జులై 7, ప్రభాతవార్త** : నెల్లూరు జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షక కమిటీలో సభ్యులుగా ఎంపికైన మారెళ్ల గురుప్రసాద్, పొట్లూరి శ్రీనివాసులును గిరిజన సంఘాల ప్రతినిధులు చచ్చాల్ ప్రసాద్, దాసరి శరవణ, ఏందోటి సురేంద్ర, ఇండ్ల సురేంద్ర లు జయభారత్ హాస్పిటల్ నందు శాలువలు, పూల మొక్కలు అందించి ఘనంగా సత్కరించారు. నిరంతరం జయభారత్ హాస్పిటల్ ద్వారా గిరిజనులకు ఉచిత వైద్యంతో పాటు, ఉచిత నేత్ర వైద్య శిభిరాలు నిర్వహణ, గుండె జబ్బులతో బాధలు పడుతున్న గిరిజనులకు చెన్నై లోని సూపర్ స్పెషల్ హాస్పిటల్ వారితో మాట్లాడి ఉచితంగా వైద్య సహాయంతో పాటు గిరిజన బాలబాలికలకు బాల సంస్కార కేంద్రాల ద్వారా విద్యా దానం అందిస్తున్న జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కి, అదే విధంగా నిత్యము గిరిజన సంఘాలలో పర్యటనచేస్తూ గిరిజనుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న పొట్లూరి శ్రీనివాసులు గారికి కమిటీలో సభ్యులుగా నామినేట్ చేసిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డికి గిరిజన నేతలు ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు.

## జులై9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**కావలి రూరల్,జులై7,ప్రభాతవార్త:** కార్మికుల, రైతుల సమస్యల పరిష్కారంకోసం జులై9వ తేదిన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటిసభ్యులు టి మాల్యాద్రి తెలిపారు. కావలి సిపియం పార్టి కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.మన దేశంలో పెట్టుబడిదా రుల, కర్పోరేట్‌సంస్థల ప్రయోజనాలకోసం మోది ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోర్టును తెచ్చింద న్నారు.వ్యవసాయాన్ని కార్పోరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు.ఉపాదిహామి చట్టాన్ని నిర్వీర్యం చేసిందనిఅన్నారు.ప్రభుత్వ సంస్థలను ప్రవేటుపరం చేస్తుందన్నారు.వీటికి వ్యతిరేకంగ కార్మికుల రైతుల సమస్యలను పరిష్కారం చేయాలని నాలుగు లేబర్ కోర్టులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.కార్మికులందరికి కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలన్నారు.రైతుల వద్దనున్న వ్యవసాయాన్ని కాపాడి పంటలకు మద్దతుధర కల్పించాలన్నారు.ఉపాదిహామి చట్టం పటిష్టంగ అమలుపరచాలన్నారు. అంగన్‌వాడి,ఆశా, మద్యాహ్న భోజనం,పంచాయతి,భవననిర్మాణ,ఆటొ,అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కారించాలన్నారు. కావలి,బోగోలు,జలదంకి మండలాలలో సమ్మెచేసి ప్రదర్శన జరపాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో కావలి మండల అధ్యక్షుడు పి సీతారామయ్య,కెవిపిఎస్ జిల్లా కమిటి సభ్యుడు కె జాన్‌లు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలను కాపాడుతున్న రక్త దాతలు ధన్యులు




**కావలి రూరల్, జులై 7, ప్రభాతవార్త** : ప్రజల ప్రాణాలను కాపాడుతున్న రక్త దాతలు ధన్యులని కావలి శాసనసభ్యుడు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు.ప్రపంచ రక్తదాతల దినోత్సవాలు 2025 ముగింపు కార్యక్రమం కావలి శ్రీనివాస కళ్యాణ మండపంనందు జరిగింది.ఈకార్యక్రమంలో గత సంవత్సరం రక్తదాన శిభిరాలు నిర్వహించిన సంస్థలు,రక్తదాన ప్రేరేపకులకు పురస్కారాలు, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు,ఈకార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడారు.నిబద్దత,నిజాయితి,నిస్వార్ధంతో పనిచేసేవారు ప్రజల హృదయాలలో నిలిచిపోతారని తెలిపారు కావలి పట్టణంలో రెడ్‌క్రాస్, ఐఎంఎ,రోటరిక్లబ్,టీమ్ సేవియర్స్,సంయుక్త,అభయం,జనవిజ్ఞాన వేదిక సంస్థలు తాము ప్రభుత్వ పరంగ చేసే సంక్షేమ కర్యాక్రమాలకు సమాంతరంగ సేవలందజే స్తున్నారని అభినందించారు.కావలి లాంటి చిన్న పట్టణంలో వేలాదిమంది రక్తదాతలు వుండడంలో రెడ్‌క్రాస్ పాత్ర ముఖ్యమైనదన్నారు.రాష్ట్ర స్థాయిలో ప్రతి ఏడాది రక్తదాతల సమీకరణలో ప్రధమ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు.కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షులు ఆర్‌డిఒ ఎం వంశీకృష్ణ మాట్లాడారు.రెడ్‌క్రాస్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిదిగ పాల్గొన్న రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాదికారి పి రామచంద్రరాజు మాట్లాడారు.రాష్ట్రంలోని జిల్లా శాఖలతో పోటీపడుతు కావలి సబ్‌బ్రాంజ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.రాష్ట్ర స్థాయిలో ప్రబుత్వ సంక్షేమ కార్యక్రమాలు,పేదరిక నిర్మూలనలో భాగస్వామ్య మవుతున్నామని అన్నారు.ఈకార్యక్రమంలో వివిద పాఠశాలల విద్యార్దులు తమ నృత్య,గాన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు.సంయుక్త నృత్య కళానిలయ ంవారు ప్రదర్శించిన లఘు నాటిక,రక్తం దొరకక ప్రజలు పడే ఇబ్బందులను కళ్ళకు కట్టినట్లు చూపి ప్రేక్షకుల ను కంటతడి పెట్టించింది.అనంతరం అదికంగ రక్తదానం చేసిన వారిని ఎంఎల్ఎ దగ్గుమాటి సత్కరించారు.ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి,రోటరి ఇంటర్‌నేషనల్ 3160 జిల్లా కార్యదర్శి డాక్టర్ కె మాధవరెడ్డి,ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ వి గోపి,కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ టి రవిప్రకాష్,వైస్ చైర్మన్ కె హరినారపరెడ్డి,కోశాదికారి ఆరికట్ల మధుసూదన్‌రావు,పాలకమండలి సభ్యులు మద్దుల నరసింహరావు,గొట్టిపాటి మనోరమ,ఇలింద్ర శ్రీవాణి,ఒరుగంటి వెంకటేశ్వర్లు,ఎన్ ప్రణీత్,డాక్టర్ పి శ్రీధర్,బెజవాడ ప్రసన్నకుమార్,జెవివి అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు,కార్యదర్శి గాదిరెడ్డి హర్‌నాద్,జి మురళాకృష్ణ,గాయకులుఎస్ రామచంద్రరావు,ఎస్ రమణయ్య,రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్బావ దినోత్సవ వేడుకలు

**పేరు మార్పు ప్రకటన**

నేను, ఇండ్ల లావణ్య భర్త ఇండ్ల పోలయ్య, డి.నెం.27/57, జి.బి.కె.ఆర్. ST కాలనీ, వింజమూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పిన్‌కోడ్-524228 నివసిస్తున్నాను నా పేరు ఇక పైన ఇండ్ల శిరీషగా మార్చు కుంటున్నాను దీనికి సంబంధించిన న్యాయ ప్రక్రియ పూర్తి చేసియున్నాను.



**కలువాయి జులై 7 ప్రభావార్త** : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎంఆర్‌పిఎస్ ఆవిర్బావ దినోత్సవ వేడుకలను కలువాయిలోనిమండల అధ్యక్షులు దండు బార్గవ్ సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా బస్టాండ్ కూడలి నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మందకృష్ణ మాదిగ ఎంఆర్‌పిఎస్ ఉద్యమానికి 7 జులై 1994లో మొదలై 31 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేస్తు ఎన్నో ఉద్యమాలు చేసినందుకు గాను ప్రజా ఉద్యమ నాయకుడుకి పద్మశ్రీ మందకృష్ణ మాదిగగా గుర్తింపు తెచ్చుకోవడం ఆయనకే సాటిని బార్గవ్ అన్నారు. అదేవిధంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని అరుంధీయ వాడలో కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులు దండు బార్గవ్ మాదిగ సీనియర్ నాయకుడు అనంతయ్య మాదిగ,ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు,రాజకుమార్,పెంచల నరసయ్య,నవీన్, శివా,కిషోర్,ప్రశాంత్,కళ్యాణ్, మాదిగ విద్యార్దులు పాల్గొన్నారు.

## ఎంపిడిఒని సత్కరించిన నేతలు



**సీతారామపురం జులై 7 ప్రభాతవార్త** : సీతారామపురం ఎంపిడిఒగా అప్పాజి సోమవారం స్దానిక మండల పరిషత్ కార్యాల యంలో బాద్యతలు స్వీకరించారు.ఇప్పటికి ఉదయగిరి మండల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తు సీతారామపురం మండల ఎంపిడిఒగా అదనపు బాద్యతలు స్వీకరించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి మండల అభివృద్దికి పనిచేస్తానని ఆయన తెలిపారు. ఆయనను సర్పంచ్ కొడవటి కంటి బాగ్యకుమారి మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరపతయ్య, సచివాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి ఆహ్వానం పలికారు.

## రక్తదానప్రోత్సాహంకు పురస్కారం



**బిట్రగుంట జులై 7 ప్రభాతవార్త:** కావలి ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఎక్కువసార్లు రక్తదాన శిబిరం నిర్వహించడంలో ప్రోత్సాహం తీసుకున్నందుకు గాను కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మరియు కావలి ఆర్ డి ఒ వంశీకృష్ణ చేతుల మీదుగామండలం లోని విశ్వనాధరావు పేట పంచాయతీ రామస్వామి పాలెం కు చెందిన అల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా జాయింట్ సెక్రటరీ బత్తల రవిచంద్ర కు అవార్డును బహుకరించారు. ఈ సందర్బంగా రవిచంద్ర మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యత ను పెంచిందని ఇందుకుగాను సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా లోకేష్ కి వీడ్కోలు

**వెంకటాచలం జులై 7 ప్రభావతవార్త** : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా పర్యటన ముగించుకొని తిరిగి రేణిగుంటకు వెళుతున్న సందర్భంగా వెంకటాచలంలోని సర్వేపల్లి రోడ్డు వద్ద సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని లోకేష్ కు ఘన స్వాగతం పలికారు

## అవినీతి ఉద్యోగులపై డ్వామాలో చర్యలు శూన్యం - అవినీతిలో కూరుకుపోయిన వారికి రీ పోస్టింగ్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రఘు ఫిర్యాదు



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త** : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పరిస్థితి పూర్తిగా జిల్లా కార్యాలయంలో దారుణంగా మారిందని ఉపాధి హామీ పనుల నిజనిర్ధారణ కమిటీ జిల్లా కన్వీనర్, మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొప్పాల రఘు ఆరోపించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు జిల్లా ఇన్చార్జి డిఆర్ఓ హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించినారు. అనంతరం కొప్పాల రఘు మీడియాతో మాట్లాడుతూ డ్వామాలో ఐదు సంవత్సరాలు పూర్తయిన ఉద్యోగులను బదిలీలు చేయకుండానే నిబంధనలను తుంగలో తొక్కి వారికి నచ్చిన వారికి సంవత్సరాల తరబడి వారికి నచ్చిన చోటే బదిలీ చేసుకోవడం జరుగుతుందని దీనిపై సర్వత్ర ప్రజల్లో విమర్శలకు దారి తీస్తుందన్నారు. ఇటీవల ఓ దినపత్రికలో కలెక్టరేట్ డెడ్లైన్లో వెలువడిన డ్వామాలో బదిలీల డ్రామా అనే శీర్షికకు కలం చేకూర్చే ఇలా సదరు కార్యాలయం పనితీరు ఉందని విమర్శలు కూడా ప్రజల్లో ఉన్నాయన్నారు. బదిలీల పేరుతో వారికి తమ సెక్షన్లలో తీసుకుంటారే తప్ప వేరే స్థానాలకు మండలాలకు బదిలీలు చేసిన దాఖలాల్లేవన్నారు. 2019లో కార్యాలయంలోని సోషల్ ఆడిట్ అకౌంటెంట్ బిలిటి సెక్షన్‌లో జాయిన్ అయిన ప్రసాద్ అను వ్యక్తి సమస్తకు గుండెకాయ లాంటి వారిని హెచ్ఆర్ సెక్షన్లో అన్ని తానై ఉన్నట్లు వ్యవహరిస్తూ ఆరు సంవత్సరాలు దాటిన ఏదో ఒక వంకలో తాను బదిలీ అయినట్లు చూపిస్తూ మాయాజాలం చేస్తున్నారన్నారు. సదరు వ్యక్తి పిడికి కూడా తెలియకుండానే మే నెలలో ఆత్మకూరులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వసుధను ఏఎస్ పేటకు మార్చాడని, అదేవిధంగా టెక్నికల్ అసిస్టెంట్ సతీష్‌ను ఇటీవలే ఏఎస్పేట నుంచి ఆత్మకూరుకు మార్చారి నెల తిరగకుండానే యధావిధిగా అదే స్థానంలో కూర్చోబెట్టాడన్నారు. అదే హెచ్ఆర్ సెక్షన్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శారదా అనే మహిళను ఐదు సంవత్సరాలు పూర్తయినప్పటికీ బదిలీ చేయలేదన్నారు. ఇదే సెక్షన్లో జియోగ్రాఫికల్ మిషన్ సిస్టంలో పనిచేస్తున్న రాధికను 10 సంవత్సరాలు దాటిన డ్వామాలోనే జే ఎస్ సెక్షన్లో సోషల్ ఆడిట్లోకి మారుస్తూ అధికారులను సిబ్బందిని తప్పుదోవ పెట్టించిన అతనిపై చర్యలేందుకు తీసుకోలేదని రఘు ప్రశ్నించారు. అదేవిధంగా మరో ఉద్యోగి జ్యోతిలక్ష్మి 10 సంవత్సరాల దాటిన బదిలీలు కాకుండానే దీర్ఘకాలిక సెలవులు పెడుతూ విహార యాత్రలకు వెళ్తుంటే హెచ్ఆర్ సెక్షన్ వారు ఆమెకు సమయానికి జీతాలు ఎలా అందిస్తున్నారో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలన్నారు. మరో టెక్నికల్ అసిస్టెంట్ కోవూరు ఏపీఓ కార్యాలయంలో పది సంవత్సరాలు పైగా ఉద్యోగం చేసి, పేరుకో మాత్రం కాళహస్తి సీసీగా ఉన్న బదిలీ మాత్రం జరగలేదన్నారు. ఇదిలా ఉంటే ఇటీవల డ్వామా పిడి సిసిగా పనిచేసిన ఒక యూనియన్ నాయకుడు ఏకంగా ముత్తుకూరు ఏపీవోగా పోస్టింగ్ పొందిన తీరుపై కూడా సర్వత్ర విమర్శలుకు దారితీస్తుందనన్నారు. ప్రస్తుత డ్వామా పీడీకి సీసీగా పనిచేస్తున్న వ్యక్తి అన్ని తనై కార్యాలయంలో ఏక చక్రం తిప్పుతూ ఆర్థిక లావాదేవీలు బాగా చేస్తాడని ఇతని బంధువైన ఒక ఎంపీడీవో అంతోనే జిల్లా డ్వామా కార్యాలయంలో సంవత్సరాల తరబడి దిష్టి వేసి కదలకుండా ఒకే చోట ఉన్నాడని విమర్శలు కూడా వున్నాయిన్నారు. అదే కార్యాలయంలో కోర్టు కేసుల సెక్షన్ లో ఉన్న శీను ఓర్ ఆఫ్ వాసు హెచ్ఆర్ సెక్షన్లో ఆనంద్ ప్రస్తుతం సిసి వారికి లోబడి ఉండే వారిని మాత్రమే ఉండే వారిని ఎన్నుకున్న వారిలో ఆత్మకూరులో ఎం సి సి శివకుమారి, దగదర్తి లో సిఓ ఉమామహేశ్వరి ఇందుకూరుపేటలో ప్లాంటేషన్ మేనేజర్ దయాకర్ డ్వామా లో ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారందరిపై విచారణ జరిపి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐదు సంవత్సరాలు దాటిన వారందరిని బదిలీలు చేసి అవినీతిని అరికట్టాలని రఘు డిమాండ్ చేశారు, పై తెలిపిన విషయాలన్నిటిని పరిగణంలోనికి తీసుకొని ఉపాధి హామీ పనులలో అవినీతి ఆరోపణలు ఉన్న వారికి రి పోస్టింగ్ ఇచ్చిన వారందరిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘువెంట ఉపాధి హామీ పనుల నిజ నిర్ధారణ కమిటీ జిల్లా కో కన్వీనర్ మీదూరి కళ్యాణ్ సుందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శేషం సుదర్శన్, పి. చిన్న అంజిల్, తురక విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రసన్న ఇంటిపై దాడి

**నెల్లూరు క్రైమ్ జులై 7, ప్రభాతవార్త:** కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం దాడికి పాల్పడ్డారు. స్థానిక సుజాతనగర్ లోని ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం సాయంత్రం రాళ్ల దాడి చేయడంతో పాటు లోపలికి ప్రవేశించి కొన్ని వస్తువులను పగలగొట్టారు. కోవూరులో జరిగిన వైసిపి కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడిన కొన్ని వ్యాఖ్యలే ఈ దాడికి కారణంగా అందరూ భావిస్తున్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పై ఈ సమావేశంలో ప్రసన్న కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన కొందరు టిడిపి కార్యకర్తలు, ప్రశాంతి రెడ్డి అనుచరులు ఈ దాడికి పాల్పడినట్లు అందరూ భావిస్తున్నారు. ఈ సంఘటన పై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

## ఓపెన్ స్కూల్, విద్యపీఠంకు దరఖాస్తులు ఆహ్వానం



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త** జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో, కలెక్టర్ కార్యాలయంలోని శంకరం హాల్లో జిల్లాలోని సంభందిత జిల్లా అధికారులతో ఏపిఓఎస్ఎస్ ఎన్ రోల్ మెంట్ డ్రైవ్‌లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో విద్య పట్ల ఆసక్తి వున్న ఉద్యోగులు, గృహీనులు ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదికారి వారు సూచించారు ,అధికారులు ఓపెన్ స్కూల్ విదానంలో విద్యను అభ్యసించుటకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియచేసారు. జిల్లా విద్యాశాఖాధికారి ఈ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యపీఠం దూర విద్యా విధానంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యపీఠం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆసక్తి కలిగిన వారు తేదీ 31 .07.2025 లోగా హెచ్‌టిటిపిఎస్://ఏపిఓపెన్‌స్కూల్.ఏపి.జిఓవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరకాస్తు చేసు కోవచ్చు అని తెలిపారు.ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, డ్వామా పిడి గంగాభవాని, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఆపండి



**నెల్లూరు కలెక్టరేట్, జులై 7, ప్రభాతవార్త** ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సచివాలయ ఉద్యోగుల బదిలీలను ఆఫ్ చేయాలని సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినములో కలెక్టర్ ఆనంద్ వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బదిలీల ప్రక్రియలో పలు అవుకు తంకలు జరిగాయని అందువలన బదిలీలను ఆపి పారదర్శకంగా బదిలీలు చేయాలని వారు కోరారు. పైరవీ లు ఎక్కువగా జరిగాయని అధికారులకు మంచిగా ఉన్నవారికి దగ్గర పోస్టింగులు రావడం తినే నమ్ముకున్న వారికి గ్రామాలులో పోస్టింగ్ రావడం జరిగిందన్నారు. దాంతో తమ కుటుంబాలలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని ఆ జీతంతో దూర ప్రాంతాల్లో చేయడం కష్టంగా తయారయింది అన్నారు. అదేవిధంగా ఆశ వాళ్ళం పేర్లు కూడా తమ పోస్టింగులో ఔకతవకలు జరిగాయని జేసికి వినతి పత్రం సమర్పించారు.

## పశు గ్రామ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి





**కోవూరు జులై 7 ప్రభాతవార్త** : కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, విడవలూరు మండలాల్లో జులై 7 నుంచి 14వ తేది వరకు పశు గ్రామ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, వీటిని ఆయా మండలాల్లో ఉన్న పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పశువులకు సంబంధించిన గడ్డిపై పశువులకు ఉపయోగపడే గడ్డి రకాలు ఏమేమి ఉన్నాయి అనే విషయాలపై ఈ వారోత్సవాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా పాల దిగుబడిని పెంచుకునేందుకు పాడి రైతులు దాణా ఖర్చులు తగ్గించి పచ్చగడ్డిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పచ్చగడ్డిలో అనేక రకాలైన పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ప్రధానంగా ఏక వార్షికాలైన జొన్న, పిల్లిపెసర, సజ్జలు, మొక్కజొన్నతో పాటు బహువార్షికాలైన నేతియర్ , పారాగ్రాస్ వంటి గడ్డి విత్తనాలపై పాడి రైతులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఈ వారోత్సవాల్లో పచ్చగడ్డికి సంబంధించి పూర్తివిషయాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## విద్యాశాఖ మంత్రిచే ప్రశంసలు పొందిన పీఆర్ఎన్ విద్యార్థినులు



**కోవూరు జులై 7 ప్రభాతవార్త :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు సోమవారం వీఆర్ హైస్కూ ల్‌ను ప్రారంభించిన సందర్భంగా కోవూరుకు చెందిన పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన పలు నృత్య రూపకాలు ప్రతి ఒక్కరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి వారి దగ్గరకు వచ్చి నృత్యం బాగా చేశారంటూ అభినందించి వారికి డ్యాన్స్ నేర్పిన టీచర్‌ను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

### - సిబ్బందికి పలు సూచనలు



**నెల్లూరు క్రైం, జులై 7, ప్రభాతవార్త:** రొట్టెల పండుగ రెండో రోజు బందోబస్తు ఏర్పాటును జిల్లా ఎస్పీ జీ.కృష్ణ కాంత్ స్వయంగా పరిశీలించి, సిబ్బందికి యాత్రికులకు పలు సూచనలు చేశారు. సోమవారం రాత్రికి జరగనున్న ప్రధాన ఘట్టం అయిన గంధ మహోత్సవంనకు పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. బారాషాహీద్ దర్గా, స్వర్ణాల చెరువులో అట్టహాసం గా, పూర్తి స్థాయి నిఘా నీడలో ప్రశాంతంగా కొనసాగిన రెండవ రోజు రొట్టెల పండుగ కొనసాగింది. దర్గా నందు ఏర్పాటు చేసిన తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన డ్రోన్, పిటిజెడ్, సిసి టివి పుటేజి లను పరిశీలించి, బందోబస్త్ సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. మొదటి రోజు 28, రెండవ రోజు 31 మంది తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్, బిడి టీంలతో నిరంతరం అణువణువు తనిఖీలు జరపాలన్నారు. రెండో రోజు సుమారు 3500 యాత్రికుల వాహనాలను ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ చేకున్నట్లు వెల్లడించారు. అనేక మంది వృద్ధులకు, దివ్యాంగులకు దర్గా దర్శనం, రొట్టెల మార్పిడికి అన్ని విధాల సహకరిస్తూ వారికీ దర్శనాలు, రొట్టెల మార్పిడి సజావుగా జరిగేటట్లు సేవలు అందించిన పోలీసు సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు. దర్గాలోనికి ప్రవేశం, నిష్క్రమ ప్రదేశాలలో బారికేడింగ్, ఘాట్‌లో రొట్టెల మార్పిడి ప్రదేశాలను స్వయంగా వెళ్ళి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్వర్ణాల చెరువు వద్ద రొట్టెల మార్పిడి చేసుకునే భక్తులు అనామకులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. యాత్రికుల భారీ వాహనాలను టౌన్ లోనికి రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. టౌన్ పరిధిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాలను నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని యాత్రికులను కోరారు.

## 33వ వార్డులో సుపరిపాలన తొలి అడుగు



**కావలి రూరల్,జులై7,ప్రభాతవార్త:**కావలి 33వ వార్డులో సోమవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు.ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి,తిరివీది ప్రసాద్,వార్డు టిడిపి ఇన్‌చార్జ్ జ్వాలా సుబ్రమణ్యం,పట్టణ టిడిపి నాయకుడు అమరా వేదగిరి సుబరాయుడుగుప్తలు పాల్గొని ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పదకాలు అందుతున్నాయాలేదా అని అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఒక్కరు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు.ఈసందర్బంగ వారు మాట్లాడారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈకార్యక్రమాన్ని కావలి ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలతో నిర్వహించామని తెలియజేశారు.ఈకార్యక్రమంలో బూత్ కన్వీనర్లు పట్నం శివ,కంచర్ల కళ్యాణ్‌చక్రవర్తి,గట్టం శ్రీను,భవనాసి వెంకటేశ్వర్లు,పానుగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పని చేసే వారికే పదవులు ఇస్తాం : మంత్రి నారా లోకేష్

**- ఎంతో మంది కార్యకర్తల త్యాగాల ఫలితమే మన అధికారం**

**- నిర్ణయాల్లో తప్పులుంటే సరిదిద్దుకుంటాం.. వినడానికి సిద్దంగా ఉన్నాం**

**- నెల్లూరు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్**

**- టీడీపీ బ్రాండ్ కార్యకర్తలే : ఎంపీ వేమిరెడ్డి**




**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీలో పని చేసే వారికి కష్టపడే వారికే పదవులు ఇస్తామని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తిలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. కేడర్‌ను బలోపేతం చేసేందుకు కార్యక్రమాలు రూపొందిస్తున్నామని, గతంలో మాదిరి మరోసారి నష్టపోవడానికి సిద్దంగా లేమన్నారు. నాలుగు నెలలకోసారి యావత్ కేడర్ ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. నెల్లూరు అనిల్ గార్డెన్స్ లో జరిగిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాటు మళ్లీ జరగనీయద్దు, తప్పులు జరిగితే సరిదిద్దుకుంటాం, చంద్రబాబు కూడా చెబితే వింటారు, నాలుగోసారి సీఎం అయినా వినడానికి సిద్దంగా ఉన్నారు. కార్యకర్తల అభిష్టం మేరకు ఈ నెలాఖరులోగా ఏఎంసీలు, దేవాలయ కమిటీలు పూర్తి చేస్తాం. కోటి మంది సభ్యులు గత అతి పెద్ద కుటుంబం తెలుగుదేశం పార్టీ. సొంత కార్యకర్తలను కారుకింద తొక్కేసిన నేత రాష్ట్రంలో ఉన్నారు. కనీసం ఇంటికి వెళ్లి పరామర్శించడానికి కూడా జగన్‌కి మనస్సు రాలేదు. అదే చంద్రబాబు కందుకూరు వెళ్లినప్పుడు తొక్కిసలాట జరిగితే ఇంటింటికి వెళ్లి క్షమాపణ చెప్పారు. మనకి వాళ్లకు వ్యత్యాసం అదే. ఈ రోజు మన అధికారం వెనుక ఎంతో మంది త్యాగాలు దాగి ఉన్నాయి. బాబు ని 53 రోజులు జైలుకు పంపి వేధించారు. పోలీసులు నాపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టారు. అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్నట్టే ఆలోచించి ముందుకు సాగాలని నిర్ధేశం చేశారు.

**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండిః** యువగళం పాదయాత్రలో చాలా మంది నాతో నడిచారు, మార్పు నెల్లూరు నుంచే మొదలైంది. పాదయాత్రలో ప్రధానంగా నన్ను పని చేసిన వారిని గుర్తించాలని కోరారు. సభ్యత్వం, మన టీడీపీ వంటి పార్టీ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వమించిన ఉత్తమ కార్యకర్తలతో గత ఏడాది కాలంగా సమావేశమవుతున్నా, నాయకులు, కార్యకర్తల స్వరం వినాలి. కార్యకర్తే అధినేత అని నమ్మి వారికి పెద్ద పీట వేస్తున్నాం. 2013 నుంచి పార్టీలో నేను క్రియాశీలకంగా ఉన్నా, ప్రభుత్వం చేపట్టే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలన్నీ ప్రతి కార్యకర్త డోర్ టు డోర్ వెళ్లాలి. ప్రతిపక్షంలో ఉండగా టెక్నాలజీతో జోడించి కార్యక్రమాలు నిర్వహిస్తే ఫలితాలు వచ్చాయి. గత ఏడాది కాలంలో సభ్యత్వం తర్వాత సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమం మాత్రమే ఇచ్చాం. కార్యకర్తలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములై కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మంత్రి వర్గంలో 17 మంది కొత్తవాళ్లు ఉన్నారు, అయినా మంత్రులందరూ తరచూ కొర్చొని క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు.

**టీడీపీకి బ్రాండ్ కార్యకర్తలేః ఎంపీ వేమిరెడ్డి**

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ జెండా మోసే కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటారని, టీడీపీలోకి బ్రాండ్ కార్యకర్తలేనని చెప్పారు. తెలుగు జాతి ఉన్నంత వరకు పార్టీకి ఎలాంటి డోకా లేదన్నారు. ఈ రోజు కార్యకర్తలుగా ఉన్నవారు. రేపు నాయకులుగా ఎదగడం తెలుగుదేశం పార్టీలోనే సాధ్యమని, కార్యకర్తలను పలకరించి వారి సమస్యలను పరిష్కరించేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని, కార్యకర్తలు ప్రజలతో మమేకం అవడానికి ఇంటింటి ప్రచారం ఉపయోగపడుతుందన్నారు. ఉదయగిరిలో ఇంటింటి ప్రచారంలో తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలకు ఆయన పరిష్కారం చూపడాన్ని సభలో ప్రస్తావించారు. సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎన్‌ఎండీ ఫరూక్, జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడారు.

## మంత్రి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగ కలసిన ఎమ్మెల్యే



**కావలి రూరల్, జులై 7, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏర్పడి తొలిసారిగ వివిద కార్యక్రమాల నిమిత్తం నెల్లూరు పట్టణానికి విచ్చేసిన ఐటిశాఖ,హెచ్‌ఆర్‌డి శాఖామంత్రి నారా లోకేష్ బాబుని సోమవారం నెల్లూరులోని అనిల్ గార్డెన్‌నందు కావలి శాసనసభ్యుడు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగ కలసి ఆయనకు బొకేను అందజేసి స్వాగతం పలికారు .ఈ కార్యక్రమంలో టిడిపినేత తిరివీధి ప్రసాద్ తదితర టిడిపి నేతలు పాల్గొన్నారు.

## వైసీపీ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



కోవూరు **జులై 7, ప్రభాతవార్త:** కోవూరు మండలం పడుగుపాడులోని రుక్మిణి కళ్యాణ మండపంలో జరిగిన కోవూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ప్రసన్న కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డి సూచనలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేవలం అలవికాని హామీలు, ఈ వీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో రాష్ట్రాన్ని అప్పులమయంగా చేసిందే తప్ప ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఏ పార్టీ ఉన్నప్పుడు అభివృద్ధి జరిగిందో ప్రజలకు పూర్తిగా తెలుసన్నారు. ఐదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన జగన్‌మోహన్‌రెడ్డి స్వర్ణయుగంలా చేస్తే ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర రుణాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. ప్రస్తుతం పీ4 కార్యక్రమం అంటూ కొత్త నాటకానికి ముఖ్యమంత్రి తెరలేపారన్నారు. ఇప్పటికే ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నారని, మరలా ముఖ్య మంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 40 శాతం ఓట్లు వచ్చినా వైసీపీకి తక్కువ సీట్లు రావడం ఏమిటని, ఇందుకు ఈవీ ఎంలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ జెడ్పీ చైర్మన్ వెంకటరెడ్డి, కోవూరు నియోజకవర్గ వైసీపీ యువ నాయకులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, యాక్టివ్ కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కూరగాయల మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏసి సుబ్బారెడ్డి



**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త** : నెల్లూరు నగరంలోని ఏ.సి. సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో లీగల్ మెట్రాలజీ శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ధృవీకరించని ఎలక్ట్రానిక్ తూకాల యంత్రాలు వాడినందుకు 8 కేసులు నమోదు చేసారు. వ్యాపారస్థులు ఉపయోగించే తూనికపు పరికరాలను ముద్రలు వేయించుకోవాల్సిందిగా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే, ఈ తనిఖీల సమయంలో కూరగాయల మార్కెట్లో తక్కువ డెలివరీ తమ దృష్టికి రాలేదని తెలిపారు. తుకములో తేడాలను గుర్తిస్తే తమ దృష్టికి తీసుకొని రావలసిందిగా తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్‌లు షేక్ రియాజ్ అహమ్మద్, కావలి ఇన్స్పెక్టర్ షేక్. మొహిస్సిన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పనివిధుల్లో పారదర్శకత, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ఇటువంటి తనిఖీలు భవిష్యత్తులో తరచు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

## బుచ్చి నారాయణ పాఠశాలలో ఘనంగా వనమహోత్సవ వేడుకలు




**బుచ్చి జులై 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ లో ఎజిఎం రవివర్మ, ఆర్.ఐ ఆదిశేషయ్య,కోఆర్డినేటర్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిఫల్ ఇస్మాయిల్ నేతృత్వంలో వన మహోత్సవ కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రిన్సిఫల్ ఇస్మాయిల్ మాట్లాడుతు పర్యావరణాన్ని కాపాడడానికి చెట్లు ప్రధాన కారణమని జనాబా పెరిగే కొద్ది కాలుష్యం - పెరుగుతుందని కాలుష్యాన్ని నివారించడానికి మానవాళికి చెట్లు ప్రధాన ఆయుధమని పర్యావరణ పరిరక్షణ ప్రధాన ధ్యేయమని అధి మందరికి బాధ్యత కర్తవ్యమని చెప్పారు. అనంతరం విద్యార్థులు,ఉపాధ్యాయులందరు కలిసి ఎంతో ఉత్సహంతో పట్టణ వీధుల్లో " చెట్టను కాపాడండి- పర్యావరణాన్ని పరిరక్షించండి "

అంటు నినాదాలు చేస్తు పెద్దఎత్తున ర్యాలీని నిర్వహించారు. ప్రజలలో పర్యావరణ సమత్యులత పట్ల అవగాహన తీసుకొని వచ్చిందుకే ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాల ఆరవణంలో విద్యార్థులు తెచ్చిన మొక్కలను ఒక్కోక్క విద్యార్థిని, ఒక్కోక్క మొక్క చొప్పున ఉపాధ్యాయుల సమక్షంలో నాటించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇస్మాయిల్, ఎ.ఒ కృష్ణమోహన్, ఏడి రాజశేఖర్, పదో తరగతి ఇంచార్జి మురళీ రాజ్,వైస్ న ప్రిన్సిపల్ సుహాసిని, సుజాత, ఉపాధ్యాయని, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులందరు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అర్జున్‌రెడ్డి చొరవతో కాలువ పూడికతీత




**బుచ్చి జులై 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఖాజా నగర్‌లో ఆదివారం నాడు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జునరెడ్డి పర్యటించారు. స్థానిక ప్రజలు గుడిపల్లి కాలువలో చెత్త నిండి ఉందని దీంతో దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నగర పంచాయితీ అధికారులకు కాలువలో ఉన్న చెత్తను తొలగించాలని అధికారుకు తెలియజేశారు. అర్జున్‌రెడ్డి ఆదేశాలతో చైర్మన్ మోర్ల సుప్రజా మురళీ పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు , మైనార్టీనాయకులు సుభానీ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. నాయకులు,కార్యకర్తలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## ఆధార్ లింకు ద్వారానే అన్నదాత సఖీభవ వర్తింపు

### - వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ పి.సత్యవాణి



**నెల్లూరు అగ్రికల్చర్, జులై 7, ప్రభాతవార్త** అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి అర్హత పొందేం దుకు ప్రతి రైతు తమ భూమిని ఆధార్‌కి అనుసంధానించుకొని ఉండాలని, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో, రెండు లక్ష 2,00,295 కుటుంబాలు అన్నదాత సుఖీభవకు అర్హత పొందాయని వివరించారు. మే 2వ తేదీ వరకు జరిగిన మొదటి దశ డేటా ప్యూరిఫికేషన్ లోనూ, రెండవ దశ అయినా ఆర్టిజీఎస్ వాలిడేషన్లోనూ, మూడవ దశ అయిన ఈకేవైసీలోను వివిధ కారణాలతోటి రిజెక్ట్ అయిన రైతుల వివరాలు గ్రీవెన్స్ మాడ్యుల్ నందు పొందుపరచానికి జులై నెల 10వ తేదీ వరకు అవకాశం కల్పించారు. కావున ప్రతి రైతు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వారు అన్నదాత సుఖీభవకు ఎందుకు అనర్హులయ్యారు. తెలుసుకొని వాటిని సరిచేసుకున్నచో, గ్రీవెన్స్ మాడ్యుల్ నందు వారి వివరాలను పొందు పరుస్తారు. జులై నెల 10వ తేదీ వరకు ఫిర్యాదుల స్వీకరణ, అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు పొందుపరచడం జరుగుతుందన్నారు. అదే విధంగా మే 2వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు ఆధార్ లింకింగ్ కానీ రాంగ్ ఆధార్ కరెక్షన్ కానీ చేసుకున్న వివరాలు కూడా పోర్టల్ నందు న్యూ లీ మ్యాప్డ్ ఇన్ వెబ్ ల్యాండ్ అన్న ఆప్షన్ తోటి వారి వివరాలు కనిపిస్తున్నాయి. కావున తమ వివరాలను సరి చేసుకున్న ప్రతి రైతు తమ సమీపంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి, అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు తమ వివరాలను పొందుపరిచినట్లయితే అన్నదాత సుకీభవ పథకానికి అర్హులవుతారు. అదే విధంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ అనునది కంటిన్యూస్ ప్రాసెస్ కాబట్టి జూన్ 30 తర్వాత వెబ్లాండ్ రికార్డ్ నందు ఆధార్ లింక్, రాంగ్ ఆధార్ కరెక్షన్స్ కానీ చేసుకున్న ప్రతి రైతు తర్వాతి కాలంలో ఈ పథకానికి అర్హులవుతారని ఈ సందర్భంగా తెలియజేయడమైంది. అదే విధంగా ఆన్ సెటిల్డ్ ఇనాం భూములు, రీ సర్వే జరిగిన గ్రామాల్లో సర్వే కాని భూముల వివరాలను ప్రత్యేకంగా జాయింట్ కలెక్టర్, కలెక్టర్ ద్వారా వ్యవసాయ శాఖ కమీషనర్ వారికి పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కాబట్టి ఆ వివరాలను కూడా త్వరలో ప్రభుత్వానికి అందజేయడానికి జిల్లా వ్యవసాయ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ద్వారా వివరాలను తెప్పించుకుని ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా కౌలు రైతులు, దేవాదాయ భూములకు ప్రతి సంవత్సరం అక్టోబర్, జనవరి లలో రెండు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని, దీని గురించి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉందని కావున అర్హత ఉన్న ప్రతి రైతు అన్నదాత సుఖీభవకు స్కీమునకు లబ్ది పొందుతారని తెలియజేయడమైంది. అదే విధంగా ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కారని ఈ సందర్భంగా తెలియజేయడమైంది. వెబ్లాండ్‌లో ఉండి తమ భూమికి తమ ఆధార్ లింక్ సరిగా ఉన్న ప్రతి రైతు కుటుంబం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకానికి అర్హులు అవుతారని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలియజేశారు.

## బారా సాహెబ్ దర్గాను సందర్శించిన కొమరగిరి నందకుమార్



**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త -వైద్యం** తెలంగాణ విద్యుత్ సంస్థ లో చీఫ్ జనరల్ మేనేజర్‌గాపని చేయుచున్న మన నెల్లూరు వాసి కొమరగిరి నందకుమార్ బారా సాహె బ్ దర్గాను సందర్శించడం జరిగింది. దర్గాలోని విద్యుత్ శాఖ స్టాల్‌కు వచ్చి అందరిని ఆప్యాయంగా పలకరిం చ డం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా సొంత ఊరు నెల్లూరు జిల్లా అని నా మొదటి పోస్టింగ్ కూడా నెల్లూరులోనే ఏఈ, ఏడీఈ, డీఈ, ఎస్ఈగా పని చేశానని విభజనలో భాగంగా నేను తెలం గాణ రాష్ట్రానికి వెళ్లడం జరిగిందని తెలిపారు. నేను ప్రతి సంవత్సరం రొట్టెల పండుగలో పాల్గొనడం ఆన వాయితీ అని ఈ రొట్టెలు పండుగ మత సామరస్యానికి ప్రతి రూపమని తెలిపారు. ఇక్కడ రొట్టెలు పట్టు కున్న వారికి వారి కోరికలు ఖచ్చితంగా తీరుతాయని నాకు ప్రగాఢ నమ్మకం అని తెలిపారు. ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ నెల్లూరు శ్రీధర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎంఆర్‌టీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అశోక్ పాల్గొన్నారు.

## వైకాపా శ్రేణులకు అండగ వుంటాం



**వరికుంటపాడు,జులై7,ప్రభాతవార్త** : వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టిని నమ్ముకొనివున్న ప్రతి కార్యకర్తకు తామ అండగ వుంటామని ఉదయగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నట్లు వరికుంటపాడు మండల పార్టి కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు,దుత్తలూరు మండలపార్టి కన్వీనర్ దొంతురెడ్డి వాసుదేవారెడ్డిలు తెలిపారు.సోమవారం బ్రాహ్మణపల్లెలో జరిగిన విస్తృతస్థాయి సమావేశానకి వరికుంటపాడు,దుత్తలూరు మండలాలనుంచి వైకాపా శ్రేణులు సోమవారం తరలివెళ్ళారు.ఈసందర్బంగ సమన్వయకర్త మేకపాటి రాజగోపాలరెడ్డిని నెల్లూరు జిల్లా పరిశీలకుడు జంకే వెంకట్‌రెడ్డిలను శాలువ,పూల మాలలతో ఘనంగా సత్కరించారు.ఈసందర్బంగ పార్టి చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటికి చేరేల చూడాలని తమ అదినాయకుడు సూసించినట్లు వారు తెలిపారు.ఉదయగిరి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మానం మస్తానయ్య తనకు పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలుపుతు రాజగోపాలరెడ్డిని సత్కరించాడు. ఈకార్యక్రమంలో మాజి ఎఎంసి చైర్మన్ షేక్ ఆలీఅహమద్,జిల్లా ఇసి మెంబర్ మాగంటి శ్రీనివాసులు,యువనేతలు ఎర్రగూటి చెంచురెడ్డి,అడుసుమల్లి సిసింద్రి, తూర్పుచెన్నంపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి,మారంరెడ్డి శివ,వెంకటేశ్వర్లు,నారాయణరాజు,మధు,శివ,తదితరులు పాల్గొన్నారు.